సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 29 । మార్చి । 2025



21 సేవలు రెడీ

దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు అందించనున్నారు. 21 రకాల సేవలు అందనున్నాయి.


- IIలో



సిండికేటుదే మాట

టెక్కలిలో ఆశీలు వేలంపాట సిండికేటుకే దక్కింది. అధికార పార్టీ కనుసన్నల్లోనే పాట జరిగింది.

- IIలో



న్యూస్‌రీల్

ఏప్రిల్ 1కి సోషల్ స్టడీస్ పరీక్ష వాయిదా



శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఈనెల 31వ తేదీన జరగాల్సిన సాంఘిక శాస్త్రం (సోషల్ స్టడీస్) పరీక్షను ఏప్రిల్ ఒకటో తేదీకి ప్రభుత్వం వాయిదా వేసింది. సోమవారం రంజాన్ పండగ కావడం, ప్రభుత్వ సెలవు దినంగా భావిస్తుండటంతో ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పరీక్ష వాయిదా పడిన విషయాన్ని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేసేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య విజ్ఞప్తి చేశారు.

ఉగాది, శ్రీరామనవమిలకు ఆప్కో వస్త్రాలపై భారీగా డిస్కౌంట్లు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగలైన ఉగాది, శ్రీరామనవమి సందర్భంగా ఆప్కో వస్త్రాలపై 35 నుంచి 50శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి అనుపమ దాస్ తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం వంటి ఆన్‌లైన్ స్టోర్స్‌లో కూడా ఆప్కో వస్త్రాలు లభిస్తాయని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆప్కోహ్యాండ్‌లూమ్.కామ్ వెబ్‌సైట్‌లోనూ కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఉగాది వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

శ్రీ విశ్వావసునామ ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు కోరారు. ఉగాది వేడుకల నిర్వహణపై జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనలతో ఈనెల 30వ తేదీన ఉగాది వేడుకలను అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు వారి సంప్రదాయం ఉట్టిపడే విధంగా మామిడాకుల తోరణాలు, అరటి చెట్లతో అలంకరణలు చేయాలని సూచించారు. ఉగాది పంచాంగ శ్రవణం, వేదాశీర్వచనం ఏర్పాట్లను దేవదాయశాఖ నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు శాఖ శాంతిభద్రత బాధ్యతలు పరిశీలించాలని, ఉగాది పచ్చడి, పులిహోర, చక్రపొంగలి స్త్రీశిశు సంక్షేమశాఖ, డీఎస్‌ఓ పంపిణీ చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానశాఖకు వేదిక అలంకరణ బాధ్యతలను అప్పగించారు. అలాగే పలు ఏర్పాట్లను ఆయా శాఖలకు అప్పగించారు. సమీక్ష సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, డీఎస్‌ఓ సూర్యప్రకాష్, దేవాదాయ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ్‌స్వామి, అరసవిల్లి ఈఓ భద్రాజీ, సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, ఆయా శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఆధ్యాత్మిక చింతన కలిగిన పవిత్ర మాసం రంజాన్ అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ అన్నారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ పండగ సందర్భంగా ఇఫ్తార్ విందును శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శాసన సభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీ ఓ సాయి ప్రత్యూష, జిల్లా మైనారిటీ అధికారి జాన్, డీఎస్‌ఓ సూర్యప్రకాష్, జిల్లా పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశ్వరరావు, ముబారక్, అబ్దుల్ రెహ్మాన్, నిజామ్ తదితరులు పాల్గొన్నారు. –శ్రీకాకుళం కల్చరల్

ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బుట్టగొడుగు



ఎర్రటి ఎండలో శ్రామికుడికి నీడనిస్తూ 'బుట్ట'గొడుగు ఇలా విరబూసింది. జిల్లా కేంద్రంలో ఓ వైపు ఎండ మండిపోతుంటే మరో వైపు పొట్టకూటి కోసం వెదురు బుట్టలు విక్రయించేందుకు ఓ కార్మికుడు ఇలా నడుచుకుంటూ వెళ్తూ కెమెరా కంటికి చిక్కాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

పేదల కడుపుపై ఈకేవైసీ కత్తి

పేదోడి బియ్యంపై కనిపించని కత్తి వేలాడుతోంది. ఈకేవైసీ చేయించుకోవడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండడం, లక్షన్నర మందికిపైగా ఈకేవైసీ ఇంకా పూర్తి కావాల్సి ఉండడంతో బియ్యంలో కోత తప్పదనే సంకేతాలు బలపడుతున్నాయి. పొట్టకూటి కోసం వలస వెళ్లిన వారు, చదువుల కోసం ఉన్న ఊరు విడిచి వెళ్లిన విద్యార్థుల ఇప్పటికిప్పుడు సొంతూళ్లకు రాలేక, ఈకేవైసీ చేయించుకోలేక సతమతమవుతున్నారు. ఈ హడావుడి పనులన్నీ బియ్యంలో కోత పెట్టేందుకేనని సామాన్యులు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.





- ఈకేవైసీకి మరో రెండు రోజులే గడువు
- 1,70,598 మందికి పూర్తికాని ఈకేవైసీ
- వలసదారులు, విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న ప్రజలు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

పింఛన్ లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయింది. సంక్షేమ పథకాల పేర్లు కూడా జనం మర్చిపోయారు. ఖాతాల్లో డబ్బు జమ కావడం అన్నది గతంలా మారిపోయింది. ఇప్పుడు పేదోడి బియ్యంపై సర్కారు కన్ను పడింది. ఈకేవైసీ పేరిట ప్రతి రేషన్ కార్డుపైనా ప్రభుత్వం కనిపించని కత్తి వేలాడదీసింది. జిల్లాలో మొత్తం ఆరు లక్షలకు పైగా రేషన్ కార్డులున్నాయి. వీటిలో 19,39,082 మంది సభ్యులున్నారు. వీరిలో ఇప్పటి వరకు 17,68,484 మందికి ఈకేవైసీ పూర్తి చేశారు. ఇంకా 1,70,598 మందికి ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఈకేవైసీ పూర్తి కాకపోతే ఆ సభ్యుడికి ఏప్రిల్‌లో రేషన్ నిలిచిపోతుందని క్షేత్రస్థాయిలో ప్రచారం జరుగుతోంది. బియ్యంలో కోత పెట్టేందుకే కూటమి ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను తెర పైకి తెచ్చిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబాన్ని ఒక్కో యూనిట్‌గా పరిగణించి ఈకేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఐదేళ్లలోపు చిన్నారులకు ఈకేవైసీ అవసరం లేదు. మిగిలిన వారు రేషన్ డీలర్లు, వీఆర్‌ఓలు, ఎండీ యూ ఆపరేటర్ల వద్ద తక్షణమే ఈకేవైసీ చేయించుకోవాలని పౌర సరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

పేదల పొట్ట కొడతారా..



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎన్నికల హామీలు అమలు చేయకపోగా.. ఉన్న పథకాలకు కత్తెర వేస్తోందని లబ్ధిదారులు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు. జిల్లా నుంచి వలస వెళ్లిన వారి సంఖ్య చాలా పెద్దది. వీరంతా రేషన్ కార్డుల్లో సభ్యులే. రేషన్ కార్డు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇదే ఇప్పుడు ఇబ్బందిగా మారింది. మన జిల్లాలో ఎక్కువ మంది వలస కూలీలు ఉన్నారు. ఎక్కడెక్కడో ఉన్నవారంతా ఇప్పటికిప్పుడు సొంత గ్రామాలకు రావడం కాని పని. దీంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు. అలాగే ఇది పరీక్షల సమయం. ఇంజినీరింగ్, ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. వీరు వచ్చే నెలలో గానీ ఇంటికి చేరలేని పరిస్థితి. దీంతో వీరి బియ్యానికి కూడా కోత పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈకేవైసీకి మరింత గడువు ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలంటూ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు.

గడువు పెంచే అవకాశం ఉంది..

ముందుగా ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేయాలని చెప్పాం. అయితే గడువు పెంచే అవకాశం ఉంది. జిల్లాలో వలసలు, ఇతర పరిస్థితులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. ఈ గడువు పెంచే అవకాశాలు ఉన్నాయి. ఈకేవైసీ వేయకపోయినా రేషన్ సరకులు నిలిపివేయం. ఈకేవైసీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనా చెందనవసరం లేదు.

– గుంట సూర్యప్రకాశరావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

జిల్లాలో ఇదీ పరిస్థితి

మండలం	మొత్తం యూనిట్లు	ఈకేవైసీ అయినవి	ఇంకా ఉన్నవి
వజ్రపుకొత్తూరు	71439	63922	7517
సంతబొమ్మాళి	66247	59336	6911
రణస్థలం	83512	74877	8635
ఇచ్ఛాపురం	86492	77845	8647
కొత్తూరు	64752	58430	6322
కంచిలి	62793	56688	6105
టెక్కలి	63662	57610	6052
కోటబొమ్మాళి	65339	59401	5938
బూర్జ	36144	32861	3283
లావేరు	60735	55261	5474
పొందూరు	61664	56145	5519
శ్రీకాకుళం	167636	152698	14938
హిరమండలం	34293	31247	3046
జి సిగడాం	49628	45223	4405
గార	73764	67289	6475
మందస	74858	68309	6549
పలాస	83402	76172	7230
పాతపట్నం	58860	53882	4978
నందిగాం	52071	47717	4354
కవిటి	72177	66272	5905
సోంపేట	71646	65889	5757
పాలాకి	59327	54564	4763
ఆమదాలవలస	68794	63297	5497
ఎచ్చెర్ల	78845	72629	6216
సరుబుజ్జిలి	25872	23836	2036
జలుమూరు	53532	49462	4070
నరసన్నపేట	65507	60620	4887
ఎల్‌ఎన్ పేట	30192	27962	2230
మెళియాపుట్టి	49771	46098	3673
సారవకోట	46128	42942	3186
మొత్తం	19,39,082	17,68,484	1,70,598

భద్రాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



శ్రీకాకుళం అర్బన్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం భద్రాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్‌ఎస్ శర్మలు తెలిపారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో గల పలాస, టెక్కలి-శ్రీకాకుళం బస్ స్టేషన్ కాంప్లెక్స్‌ల నుంచి భద్రాచలం వరకు ప్రత్యేక సర్వీసులు నడవనున్నట్లు తెలిపారు. ఈ బస్సులు ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 7 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు భద్రాచలం చేరుకుంటాయన్నారు. తిరిగి 6వ తేదీ సాయంత్రం 5 గంటలకు భద్రాచలంలో బయల్దేరి మరుసటి రోజు ఉదయానికి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటాయని తెలిపారు. ఈ బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. అదే విధంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో రాములవారి కల్యాణం చూసేందుకు కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959225609, 9959225610, 9959225611, 08942 223188 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కేజీబీవీని సందర్శించిన ఎస్పీ



వంటశాలలో ఉడికిన అన్నం పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ, మందస: మందస మండలం, గుడారి రాజమణిపురం సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం ఉదయం సందర్శించారు. విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం విద్యాలయంలోని వంటగది, తరగతి గదులు, పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని వసతిగృహ అధికారిని ఆదేశించారు. విద్యార్థులతో కూడా మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు వాటి పరిస్థితిని పరిశీలించి విద్యాలయం ఆవరణలో అదనంగా మరి కొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, భద్రత, రక్షణ పరంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పలు ముఖ్యమైన అంశాలపై మందస ఎస్‌ఐకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్శనలో ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు, కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, స్థానిక ఎస్‌ఐ కృష్ణ ప్రసాద్, విద్యాలయం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి టీచర్ల సత్కారం



ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులను సకాలంలో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి, తీసుకురావడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన ఆర్టీసీ ఉద్యోగుల్ని ఉపాధ్యాయులు సత్కరించారు. మండలం కొళిగాం ఉన్నత పాఠశాలకు చెందిన 102 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు మండపల్లి ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రంగా విద్యాశాఖ కేటాయించింది. సుమారు పది కిలో మీటర్లు దూరం కావడంతో ఆర్టీసీ బస్సును విద్యార్థులకు కేటాంచారు. ఆరు రోజుల పాటు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సర్వీసు చేసిన పలాస ఆర్టీసీ డిపో డ్రైవర్ పి.పోలారావు, కండక్టర్‌లు కైలాష్,శ్రీనివాస్‌లను శుక్రవారం కొళిగాం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాద్ పట్నాయక్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ మహంతీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్షుల దాహార్తి తీర్చడానికి..



పక్షుల కోసం నీటిని పాత్రల్లో సిద్ధం చేసిన బూరగాం విద్యార్థులు

కంచిలి: బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న ఆలోచన చేశారు. వేసవి కాలంలో నీళ్ల లేక అలమటించే పక్షుల దాహార్తిని తీర్చడానికి పాఠశాల పరిధిలోను, గ్రామంలో పలు స్థలాల్లో పక్షుల కోసం తొట్టిల్లోను, కొబ్బరి చిప్పల్లోను నీటిని ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఒక కాకి ఎండలో స్పృహ తప్పి పడిపోవడంతో దాన్ని తీసుకొని నీరు తాగించి రక్షించారు. విద్యార్థులు చేసిన ఆలోచనను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

'విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి'



విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

అరసవల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ బిల్లుల బాదుడు దారుణంగా ఉందని, 2022 నుంచి 2024 వరకు చెల్లించిన విద్యుత్ బిల్లులపై అదనంగా సర్దుబాటు చార్జీలను రుద్దుతూ ప్రజలపై తీవ్ర భారాన్ని మోపారని, దీన్ని రద్దు చేయాలని సీపీఎం శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద సీపీఎం శ్రేణులంతా కలిసి ధర్నా నిర్వహించాయి. పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు బి.కృష్ణమూర్తిలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పి.. ఇప్పుడు దారుణంగా పెంచుకుపోతున్నారని విమర్శించారు. అదానీ కంపెనీ ఒప్పందం ప్రకారం స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారని, ఒక్కో స్మార్ట్ మీటర్ నుంచి రూ.13 వేల వరకు ఆయా వినియోగదారుల నుంచే వసూలు చేస్తారని గుర్తుచేశారు. దీనికి తోడు టైమ్ ఆఫ్ ది డే పేరుతో కొత్త విధానాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీంతో కరెంట్‌ను అధికంగా వాడే సమయంలో యూనిట్‌కు అధిక రేటు వసూలు చేసేలా ఉంటుందన్నారు. సెకీ ఒప్పందాలను, స్మార్ట్ మీటర్ల వ్యవస్థను రద్దు చేసి, అలాగే అదనపు విద్యుత్ భారాలను తగ్గించేలా ప్రభుత్వం నిర్ణయాలను ప్రకటించాలని లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కె.నాగమణి, కె.అమ్మన్నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

10 మంది టీచర్లపై సస్పెన్షన్లు ఎత్తివేత

- కుప్పిలి మాస్ కాపీయింగ్ ఘటనలో 'యూ టర్న్'
- ముగ్గురు హెచ్‌ఎంలు, ఏడుగురు టీచర్లను విధుల్లోకి తీసుకుంటున్నట్టు ఉత్తర్వులు
- మరో ఐదుగురి సస్పెన్షన్లను తాత్కాలికంగా హోల్డ్‌లో ఉంచిన అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సంచలనం సృష్టించిన కుప్పిలి మోడల్ స్కూల్ మాస్ కాపీయింగ్ ఘటనలో పది మందిపై సస్పెన్షన్లు ఎత్తివేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన వారి సస్పెన్షన్లు తాత్కాలికంగా హోల్డ్‌లో ఉంచారు. వారిపై ఆధారాలు బలంగా ఉండటం, క్రిమినల్ కేసులు నమోదు కావడంతో కొద్దిరోజులు జాప్యం జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. వారం రోజులుగా టీచర్ల సస్పెన్షన్లను రద్దుచేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని, డీఈఓపై చర్యలు తీసుకోవాలని నినదిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక తరపున పోరాటాలు జరిగాయి. ఏప్రిల్ 3 నుంచి జరిగే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌ను కూడా బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగి రాక తప్పలేదు. ప్రభుత్వ పెద్దల వరకు ఈ పంచాయితీ చేరడంతో.. విద్యాశాఖ మంత్రి లోకేష్ సూచనలతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చొరవ తీసుకున్నారు. తనను కలిసిన ఉపాధ్యాయ జేఏసీ నాయకులతో మాట్లాడారు. ఆర్జేడీ బి.విజయభాస్కర్, డీఈఓ తిరుమల చైతన్యలతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం మొదలుపెట్టారు. శుక్రవారం ఆర్జేడీ విజయబాబు జిల్లా డీఈఓ కార్యాలయానికి వచ్చి వాస్తవ ఘటనపై వివరాలు రాబట్టారు. ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ముఖ్య ప్రతినిధులతో మాట్లాడారు. సస్పెండైన 15 మందిలో ముగ్గురు హెచ్‌ఎంలు, ఏడుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్లు ఎత్తివేస్తున్నట్టు సంబంధిత అధికారులు ఉత్తర్వులు వెలువరించారు. వారి నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకుని విధుల్లోకి తీసుకుంటున్నట్టు మార్గదర్శకాలు జారీ చేశారు.



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు

ఆర్జేడీతో చర్చలు విఫలం

శ్రీకాకుళం న్యూకాలనీ: 'కుప్పిలి పంచాయితీ'కి ఫుల్‌స్టాప్ పడుతుందని ఆశించిన ఉపాధ్యాయులకు నిరాశే ఎదురైంది. పాఠశాల విద్య ఆర్జేడీ బి.వి జయభాస్కర్ పిలుపు మేరకు శుక్రవారం రాత్రి ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు డీఈఓ కార్యాలయంలో చర్చలకు హాజరు కాగా.. వీరి మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో చర్చలు విఫలమయ్యాయి. మిగిలిన ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు ఎత్తివేయాలని, డీఈఓను తొలగించాలని, కోర్టు కేసులు వెనక్కి తీసుకోవాలని, డీబారైన విద్యార్థులకు రీ ఎగ్జామ్‌నిర్వహించాలని కోరగా.. ఆర్‌జేడీ ఒప్పుకోలేదు. దీంతో శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించతలపెట్టిన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముట్టడి యథాతథంగా జరుగుతుందని తెలిపారు.

'డీఈఓపై చర్యలు చేపట్టండి'

కుప్పిలి కాపీయింగ్ ఉదంతంలో అన్యాయంగా సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు, డీబారైన విద్యార్థులకు న్యాయం చేసి, డీఈఓపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ కార్యచరణ ఉద్యమ షెడ్యూల్‌లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యేలకు ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు వినతిపత్రాలను అందజేశారు. శ్రీకాకుళంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తిలకు వినతిపత్రాలు అందజేశారు.

'విద్యార్థులకు న్యాయం చేయాలి'

కుప్పిలిలో డీబార్‌కు గురైన విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి హాజరైన ఆర్జేడీ బి.విజయ్‌భాస్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

క్లుప్తంగా

7 నుంచి డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 7 నుంచి ప్రారంభించనున్నట్లు అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ పి.పద్మారావు తెలిపారు. పరీక్షల నిర్వహణ కేంద్రంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 21 వరకు పరీక్షలు జరుగుతాయని 53 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఫిబ్రవరిలో జరగాల్సిన డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు మే చివరి వారంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ రెండో సెమిస్టర్ ఫీజులు స్వీకరిస్తున్నామని, ఏప్రిల్ 5లోపు అదనపు రుసుం లేకుండా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

యువకుడు అరెస్టు



అరెస్టయిన యువకుడితో పోలీసులు

సోంపేట: మండలంలోని బేసిరామచంద్రాపురంలో మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి ప్రయత్నించిన యువకుడిని అరెస్టు చేసినట్లు బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు శుక్రవారం తెలిపారు. దివ్యాంగురాలి తండ్రి ఫిర్యాదు మేరకు శృంగారపు ప్రసాద్ ఆచారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

30, 31న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు యథాతథం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈ నెల 30, 31 సెలవు దినాలైనప్పటికీ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని డీఐజీ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కొనుగోలు, అమ్మకందారులు రిజిస్ట్రేషన్లు యథావిధిగా చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు.

ఫిషరీస్ డీడీకి పదోన్నతి

అరసవల్లి: జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వి.శ్రీనివాసరావుకు పదోన్నతి లభించింది. డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడేళ్లుగా శ్రీకాకుళం జిల్లాలోనే వివిధ హోదాల్లో శ్రీనివాసరావు విధులు నిర్వర్తించారు. తాజా పదోన్నతుల్లో ఈయనకు క్యాడర్ పెరగడంతో పాటు బదిలీ చేశారు. పలాసలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణకు జిల్లా ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది.

సమగ్ర విచారణకు డిమాండ్



జేసీకి వినతిపత్రం అందిస్తున్న సీసీఎస్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని క్రిస్టియన్ సెక్యూలర్ సర్వీసెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బిషప్ బర్నబాస్ బింకం, ప్రధాన కార్యదర్శి బ్రదర్ ఒంపూరు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 24న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ప్రవీణ్ మృతిచెందారని, దీనిపై పలు అనుమానాలు ఉన్నందున విచారణ జరిపి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని, క్రైస్తవుల రక్షణకు భద్రత కల్పించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో సీఎస్‌ఎస్ నాయకులు, పాస్టర్లు ఎం.షడ్రక్‌బాబు, జి.శామ్యూల్ అరుణ్‌కుమార్, టి.పేతురు, ఇ.శామ్యూల్ జాన్, ప్రత్తిపాటి ప్రసాద్, ఎ.ఎ.పాల్, అల్లు ఇమ్మానుయేల్, ఆశిర్‌కుమార్, అహరోన్ తదితరులు పాల్గొన్నారు.

యూడీఐడీ.. 21 సేవలు రెడీ



- దివ్యాంగులకు ఆధార్ తరహాలో ప్రత్యేక నంబర్
- కొత్తపోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్రం
- ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా సులువుగా సేవలు పొందే అవకాశం
- ప్రయాస లేకుండా రైల్వేపాస్ పొందే సదుపాయం

నరసన్నపేట:

దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, ఇతర ప్రయోజనాలు, సదరం శిబిరాల సమాచారం తదితర సేవలను సులభంగా పొందేందుకు యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు(యూడీఐడీ) అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పోర్టల్ దివ్యాంగులకు వరంలా మారనుంది. ఈ పోర్టల్ ద్వారా పొందిన ఐడీ నంబర్ ఆధారంగా దివ్యాంగులు రైల్వే పాస్‌లను కూడా పొందవచ్చు. గతంలో సదరం సర్టిఫికెట్లు పొందాలంటే స్లాట్ బుకింగ్ కోసం మీ-సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇకపై యూడీఐడీ నంబర్ ద్వారా దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే శ్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు.

యూడీఐడీ పొందాలంటే..

హెచ్‌టీటీపీ://ఎస్‌డబ్ల్యూఏవీఎల్ఏఎంబీఏఎన్‌సీఏఆర్‌డీ.జీఓవి.ఇన్ అనే వెబ్‌సైట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా దివ్యాంగులు నేరుగా ఫోన్, ఇంటర్‌నెట్ సెంటర్, మీ-సేవా కేంద్రాల నుంచే కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సులభతరంగా సేవలు..

- కొత్తగా అందుబాటులోని తీసుకువచ్చిన యూడీఐడీ పోర్టల్ ద్వారా సేవలు సులభతరం కానున్నాయి. సదరం శిబిరాల కోసం మీ సేవతో పాటు యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. వైద్యపరీక్షలకు ఎప్పుడు హాజరు కావాలనే సమాచారం దివ్యాంగుల ఫోన్ నంబర్‌కు సంక్షిప్త సమాచారం రూపంలో వస్తుంది. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో తప్పులు, అక్షరదోషాలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుంది.
- ఇప్పటి వరకూ ఐదు రకాల సేవల వైకల్యం ఉన్న వారికే ఈ-సేవ ద్వారా సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండేది. ఇక యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల సేవల వైకల్యాలను చేర్చారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు కూడా సదరం శిబిరాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- శిబిరంలో వైకల్య నిర్ధారణ పూర్తయ్యాక స్మార్ట్‌కార్డును పోస్టల్ శాఖ ద్వారా ఇంటికే పంపిస్తారు. ఈ కార్డు పింఛన్‌తో పాటు రైల్వేపాస్‌లు, ఇతర సంక్షేమ పథకాలకు దేశ వ్యాప్తంగా చెల్లుబాటు కానుంది.
- యూడీఐడీ కార్డులను ఆన్‌లైన్ నుంచే డౌన్‌లోడ్ చేసుకొనే అవకాశం కేంద్రం కల్పించింది. ఇప్పటి వరకూ సదరం సర్టిఫికెట్ మన రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అయ్యేవి.



కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన పోర్టల్

దరఖాస్తు ఇలా..

ఆన్‌లైన్‌లో స్వాలంబన్‌కార్డు.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అప్లయ్ బటన్‌పై క్లిక్ చేసి దరఖాస్తు ప్రక్రియ సంబంధించి కొన్ని సూచనలు ఉంటాయి. వాటిని పూర్తిగా చదివి అంగీకరిస్తూ సబ్‌మిట్ క్లిక్ చేస్తే దరఖాస్తు ఫారం ఓపెన్ అవుతుంది. అడిగిన సమాచారం నమోదు చేస్తే దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. వైద్య పరీక్షలు అనంతరం వెబ్‌సైట్‌లో అర్జీల స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకోవచ్చు.

దివ్యాంగులకు వరం..



దివ్యాంగులకు ఆధార్ కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీని ప్రవేశపెట్టింది. పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని ఐడీ నంబర్ పొందవచ్చు. ప్రత్యేక కార్డు కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందాలన్నా ఈ కార్డు తప్పనిసరి కానుంది.

– కె.కవిత, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ, శ్రీకాకుళం



ఆశీల వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

సర్కారు వారి పాట.. సిండికేటుదే మాట!

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో వివిధ రకాల ఆశీలు హక్కుల కోసం శుక్రవారం నిర్వహించిన ఆశీల వేలం పాట సిండికేట్‌గా మారింది. అధికార పార్టీకు చెందిన కొందరు కార్యకర్తల కన్నుసన్నల్లో వేలంపాటదారులు సిండికేట్‌గా మారడంతో వేలం నామమాత్రంగా సాగింది. పంచాయతీ ఆశీల హక్కు కోసం ఆరంభంలో సర్కారు వారి పాటను రూ.13.92 లక్షలుగా ప్రకటించారు. అంతా సిండికేట్‌గా ఏర్పడి పాటను తగ్గించాలని అధికారులపై ఒత్తిడి చేశారు. దీంతో రూ. 12.70 లక్షలకు కుదించేశారు. చివరగా అధికార పార్టీ కార్యకర్తల డైరెక్షన్‌లో పట్టణానికి చెందిన పుచ్చకాయల రామిరెడ్డి అనే వ్యక్తి రూ.14 లక్షలకు రోజు వారీ మార్కెట్ ఆశీల వసూళ్ల హక్కును కైవసం చేసుకున్నారు. ఇదే వ్యక్తి రూ.77 వేలకు వారపు సంత, రూ.51 వేలకు బస్ అండ్ కారు స్టాండ్‌లో ఆశీల హక్కు దక్కించుకున్నారు. కమేశా హక్కును రూ.1,60,200కు జోగి ధర్మారావు కైవసం చేసుకున్నారు. కాగా, 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆశీల హక్కును దక్కించుకున్న జీరు వెంకటరెడ్డి పంచాయతీకి సుమారు రూ.7 లక్షల బకాయిలు ఉన్నట్లు అధికారులు గుర్తు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఈఓపీఆర్‌డీ సింహాద్రి, ఇన్‌చార్జి ఈఓ శశిధర్ పాల్గొన్నారు.

తరలిపోతున్న పశుగ్రాసం



దూర ప్రాంతాలకు తరలిపోతున్న ఎండుగడ్డి

గార: ఖరీఫ్‌లో పండిన వరి గడ్డి దూర ప్రాంతాలకు తరలిపోతోంది. విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వర్తకులు వచ్చి ఎండు గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలించుకుపోతున్నారు. ఈ ఏడాది ప్రైవేటు డెయిరీలు పాల సేకరణ ధర తగ్గించడంతో పశువుల పెంపకం కూడా తగ్గుముఖం పడుతోంది. వచ్చే ఖరీఫ్‌కు ఉగాది తర్వాత భూములు సిద్ధం చేసుకోవాలని రైతాంగం సమాయత్తవుతున్న పరిస్థితుల్లో పొలాల్లో ఉన్న వరి గడ్డిని అమ్మివేస్తున్నారు. దీంతో స్థానిక పశువుల పెంపకందారుకు ఇబ్బందులు తప్పవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబువన్నీ బూటకపు హామీలే

- వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న రెడ్డి శాంతి

పాతపట్నం: ఎన్నికల్లో చంద్రబాబు బూటకపు హామీలతో రాష్ట్ర ప్రజలు దారుణంగా మోసపోయారని వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా రెడ్డి శాంతిని పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పాలన ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసుకునేలా ఉండేదన్నారు. చంద్రబాబు మాత్రం హామీలు అమలు చేయకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. రైతులు, మహిళలు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల వారిని నమ్మించి మోసం చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పాతపట్నం, ఎల్.ఎన్.పేట ఎంపీపీలు దొర సావిత్రమ్మ, రెడ్డి జ్యోతి లక్ష్మి, బైపోతు ఉదయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, పోలాకి జయమునిరావు, మీసాల వెంకటరామకృష్ణ, గండివలస ఆనంద్, పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, అంధవరపు సురేష్, కొల్ల కృష్ణ, ఆర్‌టీఐ వింగ్ ఎనుగుతల సూర్యం, ఎం.తాతయ్య, శిమ్మ శాంబ, లోలుగు లక్ష్మణ, యెరుకొల వెంకటరమణ, బి.నారాయణమూర్తి, మాదవ పుల్లయ్య, ఎం.గణపతిరావు, సవర సుబాష్, అలికాన మాదవరావు, గంగధర్, సరస్వతి, రాజ్యలక్ష్మి, జానకమ్మ, ఎం.రామారావు, తులుగు ప్రవీణ్, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందల నాసర్‌జీ, సహాయ కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. శ్రీకాకుళం క్రాంతిభవన్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను రద్దు చేసి ఏ యూనివర్సిటీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష ఆ వర్సిటీయే నిర్వహించేలా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యవిద్యను పేదలకు దూరం చేసేలా జీవో 107, 108లను రద్దు చేయాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ మాట్లాడుతూ వర్సిటీల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి జి.హరిప్రసాద్, నాయకులు కూర్మా, ఈశ్వరరావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంతో చిన్నారులకు రక్షణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.ఎం.జామరుద్ బేగం

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారుల రక్షణకు పోక్సో చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని ఫస్ట్ అడిషనల్ జడ్జి కె.ఎం.జామరుద్ బేగం, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ తలే లక్ష్మణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డు ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరించారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ చట్టం ప్రకారం పిల్లలుగా పరిగణించబడతారని, బాధితులకు న్యాయ సహాయం అందించడం, వారి గుర్తింపును రహస్యంగా ఉంచడం, సురక్షితమైన వాతావరణాన్ని అందించడం చట్టం ముఖ్య ఉద్దేశమని వివరించారు. తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో మరణశిక్ష సైతం విధించే అవకాశం ఉందని చెప్పారు. పిల్లలకు మంచి చెడులను వివరించడం, వారికి అవగాహన కల్పించడం సమాజం బాధ్యతని పేర్కొన్నారు.



ఉగాది కానుకలు అందిస్తున్న సినీ నటి కవిత, దాత గుంటు వేణుగోపాల్

ఊరంతా సందడి

వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామాల్లో ప్రజల ఐక్యతకు పండగలు ప్రతీకగా నిలుస్తాయని సినీ నటి కవిత, డైరెక్టర్ చల్లా భానుకిరణ్ అన్నారు. ఉద్దాన ప్రాంతమైన ఒంకులూరులో శుక్రవారం ప్రవాసాంధ్రుడు, పారిశ్రామికవేత్త గుంటు వేణుగోపాల్ సహకారంతో నిర్వహించిన ఉగాది వేడుకల్లో వారు సందడి చేశారు. అంతకుముందు కొండ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులకు ఉగాది కానుకలు అందజేశారు. గ్రామపెద్దలు, ఉద్యోగులు, సేవకులను సన్మానించారు. టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు రూ.30 వేలు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం సామూహిక భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ దాతృత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సినీ ప్రముఖుడు బైపల్లి రవి, సర్పంచ్ లింగాల సంధ్య, జోగి అప్పారావు, వాడబలిజ సంఘ అధ్యక్షుడు చీకటి ధనుంజయ, జగన్నాథం, పురుషోత్తం, శ్రీధర్, భోజరాజు, వల్లభరావు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో హల్‌చల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని మంగువారితోటలో శుక్రవారం ఓ సస్పెక్ట్ షీటర్ మద్యం తాగి హల్‌చల్ సృష్టించినట్లు ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. బొమ్మలాట ఢిల్లీ అలియాస్ ఢిల్లీశ్వరరావు అనే యువకుడు శుక్రవారం ఉదయం మంగువారితోట బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి ఆ మైకంలో అక్కడి ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగించాడని, వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి వెళ్లి అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని పేర్కొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కంచిలి: మండలంలోని జాడుపూడి పంచాయతీ బసవపుట్టుగ పరిధిలో మర్రిచెట్టు ఊడలకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని మృతుని కుటుంబీకులు, గ్రామస్తులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు కవిటి మండలం సహలాలపుట్టుగ పంచాయతీ ముల్లు వీధికి చెందిన తుపాకీ కూర్మారావు(43)గా గుర్తించారు. మద్యానికి బానిసైన ఈ వ్యక్తి భార్యతో గొడవలు పడుతూ సుమారు 20 ఏళ్లుగా విడిగానే జీవిస్తున్నాడు. మృతుని సోదరుడు దీనబంధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల వేతనాల్లో కోత తగదు



పీడీ శాంతిశ్రీకి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఫేస్‌యాప్ పేరుతో అంగన్‌వాడీల వేతనాలలో కోత విధించవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లల తల్లులకు ప్రతినెలా ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ చేయాలన్న ఆదేశాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అధికారులు ఒత్తిడి, వేతనాలలో కోత మానుకోవాలన్నారు. ఇప్పటికే యాప్ మొరాయిస్తోందని, ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లు సరిగా పనిచేయడం లేదని చెప్పారు. అయినప్పటికీ ఎన్నో అవస్థలు పడి పని పూర్తి చేస్తుంటే మరింతగా పనిభారం పెంచడం తగదన్నారు. వేతనాల కోత, మెమోల జారీతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఎన్.హైమావతి, వి.హేమలత, జె.కాంచన, డి.మోహిని, పి.బాలేశ్వరి, ఎల్.దుర్గ పాల్గొన్నారు.

'ఉపాధి'లో ఐదు పనులకు ప్రాధాన్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ వేసవి సీజన్‌లో ఐదు పనులకు ప్రాధాన్యమివ్వాలని డ్వామా పీడీ సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల నీటిదొడ్ల నిర్మాణం, సేద్యపు నీటి కుండీలు, పంట కాలువల పునరుద్ధరణ, చెరువుల అభివృద్ధి, దినసరి వేతనం రూ.300 వచ్చే పనులపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి గ్రామానికి చెందిన బి.యువరాజు అనే వ్యక్తి కిలో 250 గ్రాముల గంజాయితో శుక్రవారం పోలీసులకు పట్టుబడ్డారు. ఈ కేసుకు సంబంధించి పాతపట్నం సీఐ రామారావు శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. యువరాజు కొంతకాలంగా త్రినాథ మేళాల కోసం చిన్నమొత్తంలో గంజాయి విక్రయించేవాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం గండాహతి నుంచి గంజాయి తీసుకొచ్చి ఇంట్లోనే ఉంచాడు. గురువారం సాయంత్రం ఒడిశాలోని రంప గ్రామంలో పెద్ద మొత్తంలో గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా ఎస్సై రమేష్ బాబు సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు.

యువహో..



యువతకు పోలీసుల సత్కారం

మందస మండలంలోని ఉమాగిరిలో ఇటీవల జరిగిన స్కూలు బస్సు ప్రమాదంలో విద్యార్థులను కాపాడిన యువకులను డీఎస్పీ వెంకట అప్పారావు శుక్రవారం సత్కరించారు. విద్యార్థులను రక్షించిన మందస, ఉమాగిరి గ్రామలకు చెందిన కోరాడ ప్రసాద్, గోపీకృష్ణ, వెంకట్రావు, సుభాష్, హేమంత్‌లను దుశ్శాలువతో సన్మానించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. విద్యార్థులను కాపాడి యువకులు ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.తిరుపతిరావు, స్థానిక ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, మందస పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. –మందస